క్లుప్తంగా

ఆసుపత్రి పరిశీలన



కడియం ఆసుపత్రిని పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ సనత్ కుమారి

కడియం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్ కుమారి సోమవారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా విచ్చేసిన ఆమె.. ఆసుపత్రిలో అందుతున్న సేవలను ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆయా కార్యక్రమాలను వివరించారు.

లోక్ అదాలత్‌పై ముందస్తు సమావేశం

కంబాలచెరువు: ఈనెల 22న జరగనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌పై సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత వివిధ ఇన్సూరెన్స్ కంపెనీలతో ముందస్తు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్పెషల్ లోక్ అదాలత్‌లో మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసుల పరిష్కారానికి సంబంధించి పిటీషనర్లు, ఇన్సూరెన్స్ సంస్థల అధికారులు, ఇరు పక్షాల న్యాయవాదుల మధ్య సమన్వయం కుదిరే విధంగా చర్చలు జరిగాయి.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి



సమావేశంలో పాల్గొన్న రీజినల్ కమిటీ నాయకులు

కడియం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని తూర్పుగోదావరి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ రూరల్ రీజినల్ కమిటీ డిమాండ్ చేసింది. జేగురుపాడులోని పేతురు మెమోరియల్ చర్చిలో సోమవారం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం కమిటీ సమావేశం జరిగింది. రూరల్ రీజినల్ చైర్మన్ డి.పరంజ్యోతి ఆధ్వర్యంలో జిల్లా వైస్ చైర్మన్ ఎం.కరుణాకర్ వాక్యసందేశాన్నందించారు. జిల్లా నాయకులు ఎస్.సాలోమెన్, పి.జాన్ డేవిడ్, పి.డేనియల్ శుభాలను అందజేశారు. డి.ఎలీషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కడియం, ధవళేశ్వరం, హుకుంపేట, శాటిలైట్ సిటీ, కొంతమూరు నుంచి రీజినల్ కమిటీ నాయకులు హాజరయ్యారు.

నగరంలో ర్యాలీ

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఓఎన్‌జీసీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా కంబాలచెరువు పార్కు నుంచి దేవీచౌక్ మీదుగా పుష్కర్‌ఘాట్ వరకూ మెగా ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ కె.వసుధ, సుభాషిణీదేవి, డాక్టర్ హరనాథ్ రెడ్డి, డాక్టర్ గౌరీనాయుడు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు తక్షణ పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ మహేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలకు తక్షణ పరిష్కారం చూపించాలని నగరపాలకసంస్థ ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటిపన్ను మార్పు, పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై 30 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సిటీ ప్లానర్ వైబీఆర్ చంద్రబోస్, ఇరిగేషన్ సూపరెంటెండెంట్ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

టీడీపీ అర్బన్ కమిటీ నియామకం

సీటీఆర్ఐ: తెలుగుదేశం పార్టీ రాజమహేంద్రవరం అర్బన్ నూతన కమిటీని నియమించినట్టు రాజమహేంద్రవరం పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్ తెలిపారు. అధ్యక్షుడిగా రెడ్డి మణేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఉప్పులూరి జానకి రామయ్య, ప్రధాన కార్యదర్శిగా బుడ్డిగ రాధాకృష్ణ, కార్య నిర్వాహక కార్యదర్శులుగా మరుకుర్తి నాగరవి చంద్రశేఖర్ యాదవ్, ద్వారా పార్వతి సుందరి, కంటిపూడి శ్రీనివాసరావు, కార్యదర్శులుగా మళ్రి దుర్గా శ్రీనివాస్, కిలపర్తి శ్రీనివాస్, లాలాఖాన్ , కోశాధికారిగా శెట్టి జగదీష్ నియమితులయ్యారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం

- సీఎం జగన్ సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, చిత్రంలో బోస్, జక్కంపూడి రాజా, చందన నాగేశ్వర్, మార్గాని భరత్, షర్మిలారెడ్డి, ఆకుల వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. స్థానిక చందన గార్డెన్స్‌లోని నియోజకవర్గ కార్యాలయంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అధ్యక్షతన సోమవారం సాయంత్రం పార్టీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మిథున్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేస్తే విజయం తథ్యమన్నారు. గతంలో జరిగిన పొరపాట్లకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు కడియం నియోజకవర్గం నుంచి గతంలో మూడుసార్లు గెలుపొందిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రతి వార్డు, గ్రామంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు.

సంక్షేమానికి జగన్ ప్రాధాన్యం

పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. జగనన్న బలపరిచిన చందన నాగేశ్వర్ నాయకత్వానికి ప్రతి ఒక్కరూ తమ సంపూర్ణ మద్దతు తెలిపాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడించడానికి రీజినల్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి పూర్తి బాధ్యతలు తీసుకున్నారని, దానిలో భాగంగానే నేడు ముఖ్య నాయకులతో సమావేశమయ్యారన్నారు. చందన నాగేశ్వర్ తండ్రి రమేష్ గతంలో ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారన్నారు. ప్రజలకు ఏ అవసరమైనా తక్షణమే స్పందించే గొప్ప వ్యక్తిత్వం ఉన్న చందన నాగేశ్వర్ నాయకత్వాన్ని బలపరిచి, ప్రోత్సహించాలన్నారు.

బలోపేతానికి కృషి

ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏపీజీఅండ్‌బీసీచైర్మన్, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన కర్తవ్యమన్నారు. ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ గతంలో ఓటమికి గల తప్పిదాలపై సమీక్ష జరిపి, రాబోయే ఎన్నికలలో పునరావృతం కాకుండా పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు, నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు (బాబు), ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, మాజీ శెట్టిబలిజ, గౌడ కార్పొరేషన్ చైర్మన్ పాలిక శ్రీను మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, వైఎస్సార్‌టీయూసీ, దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: 2005 సెప్టెంబర్ ఒకటి నుంచి 2018 ఆగస్టు 31 మధ్యలో జన్మించిన పిల్లలందరూ ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ ఏదో ఒక తరగతిలో చదువుతూ ఉండాలని, ఆ బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. దానవాయిపేటలోని వార్డు సచివాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ దిశలో నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ చేసిన నలుగురు వలంటీర్లను సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2005 సెప్టెంబర్ నుంచి 2018 ఆగస్టు మధ్యలో జన్మించిన పిల్లలు ఏఏ తరగతులు చదువుతున్నారు అనే డేటాను ఇంటింటి సర్వే ద్వారా వలంటీర్లు గుర్తించి, నూరుశాతం బడిలో చేర్పించి చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించారన్నారు. ఆక్రమంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వం విద్యావిధానంలో అమలు చేస్తున్న పథకాలు వివరించాలన్నారు. క్లస్టర్ 4లో అశ్విని, క్లస్టర్ 6 లో బి.శిరీష్, క్లస్టర్ 8లో ఎన్.అనిత, క్లస్టర్ 9లో టి.అపర్ణ, క్లస్టర్ 19లో ఎండీవీ భానుచంద్రను కలెక్టర్ ప్రశంసించారు. ఆమె వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, ఆర్ఎంసీ సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సీటీఆర్ఐ: ఐసీడీఎస్ పరిరక్షణ, వేతనాల పెంపు, గ్రాట్యూటీ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ - హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి సుమారు 2,500 మంది హాజరయ్యారు.

సుబ్బారెడ్డికి మాతృవియోగం

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ రూరల్ వాణిజ్య విభాగం సెల్ చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి తల్లి వెంకట సుబ్బమ్మ (75) సోమవారం బొమ్మూరులో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వెంకట సుబ్బమ్మ పార్థివదేహానికి ఉమ్మడి జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, పార్టీనాయకులు నివాళులర్పించారు. వారిలో కురుమళ్ల ఆంజనేయులు, యెనుముల త్యాగరాజు, తోడేటి రాజా, వైఎస్ కుమార్ ఉన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజా ప్రశాంత్

కంబాలచెరువు: మారుతున్న బోధనా పద్ధతులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని డీఎంహెచ్ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.రాజా ప్రశాంత్ అన్నారు. స్థానిక డీఎంహెచ్ స్కూల్లో సోమవారం ప్రాథమిక తరగతుల ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా ప్రశాంత్ మాట్లాడుతూ మారుతున్న బోధనా విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయుడు అప్‌డేట్ అయినప్పుడే ఆసక్తికరమైన బోధన చేయవచ్చన్నారు. స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి పరస జగన్నాథరావు మాట్లాడుతూ రానున్న ఫార్మెటివ్1 పరీక్షను విద్యార్థులందరూ ఇంగ్లిష్‌లో రాసేలా సంసిద్ధం చేయాలన్నారు. సీఆర్పీ జయంతి శాస్త్రి కాంప్లెక్స్ షెడ్యూల్‌ను వివరించారు. విషయ నిపుణులుగా వరహాగిరి కృష్ణమోహన్, కె.రాజు వ్యవహరించారు. నారాయణపురం మునిసిపల్ స్కూల్ ఉపాధ్యాయులు సునీల్ మాదిరి పాఠాన్ని బోధించారు. సీఆర్పీ జయంతి శాస్త్రి, కోటేశ్వరి, నెహ్రూనగర్, డీఎంహెచ్ స్కూల్ కాంప్లెక్స్‌లకు చెందిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు హాజరయ్యారు.

నర్సరీ ఎన్నికలకు ముగిసిన నామినేషన్లు

అధ్యక్ష స్థానానికి 4, డైరెక్టర్లకు 20 దాఖలు



నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల కమిటీ

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం అధ్యక్ష స్థానానికి 4, డైరెక్టర్ల స్థానాలకు 20 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల కమిటీ తెలిపింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసింది. అధ్యక్ష స్థానానికి ఆదివారం వేసిన నాలుగు నామినేషన్లు మాత్రమే పడ్డాయి. సోమవారం ఎవ్వరూ దాఖలు చేయలేదు. 2వ వార్డు డైరెక్టర్, 3వ వార్డు డైరెక్టర్ స్థానాలకు ఒక్కో నామినేషన్ మాత్రమే వేశారు. ఇవి ఏకగ్రీవం కానున్నాయి. మొత్తం 11 స్థానాలకు గాను మిగిలిన అన్ని స్థానాలకు రెండేసి చొప్పున నామినేషన్లు వేసినట్లు కమిటీ ప్రకటించింది. 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఇదిలా ఉండగా మరో మూడు నాలుగు డైరెక్టర్ల స్థానాలు కూడా ఏకగ్రీవం అయ్యేందుకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఏకగ్రీవానికి యత్నాలు!

కాగా ప్రతిష్ఠాత్మకమైన నర్సరీ అసోసియేషన్ పాలకవర్గం ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు నర్సరీ రంగ ప్రముఖులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లుగా చెబుతున్నారు. రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా ఉండే నర్సరీ రైతులు ఎన్నికల పేరుతో విడిపోయేకంటే.. ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా రైతుల ఐకమత్యాన్ని మరోమారు చాటుకున్నట్లు ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియకు ఒక రోజు గడువు ఉండడంతో చర్చలు సాగుతున్నట్లుగా సమాచారం. ఎన్నికలకు వెళతారా? ఏకగ్రీవం చేస్తారా అన్నది మంగళవారం సాయంత్రం 5 గంటలకు తేలనుంది. ఇదిలా ఉండగా నామినేషన్లు వేసిన అభ్యర్థులు 11 వార్డుల పరిధిలోనూ ఓటర్లను వివిధ మార్గాల్లో కలుసుకుని తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. ప్రధాన పోటీదారులు భావిస్తున్న ఇద్దరు అభ్యర్థులు ఇప్పటికే ఒకమారు ఓటర్లను కలుసుకుని వారి మద్దతు కోరారు.

పవన్ తక్షణమే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ధవళేశ్వరం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, గోలి దేవకుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, హమీద్ బాషా, మెండి రాంబాబు డిమాండ్ చేశారు. నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై బురద జల్లడం తగదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థపై అందరూ ప్రశంసలు కురిపిస్తుంటే, పవన్ మాత్రం వలంటీర్లను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. వలంటీర్లు ప్రజల డేటాను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పకుంటే వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

క్విజ్ పోటీలకు అనూహ్య స్పందన

కంబాలచెరువు: భారత రిజర్వ్ బ్యాంకు ఆర్థిక సమీకృత అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న క్విజ్ పోటీలకు అనూహ్య స్పందన లభించిందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ.ప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి పరిశీలకులుగా అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ వ్యవహరించారు. మొత్తం 18 మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కడియం మండలం దుళ్ల బీఎస్ఎన్ జెడ్పీ స్కూల్ విద్యార్థులు సీహెచ్‌వీడీ మణికంఠ, కె.యశ్వంత్ కుమార్ ప్రథమ, సీతానగరం మండలం వెదుళ్ల పాఠశాల విద్యార్థులు పి.సాయి చరణ్, ఎస్.హిందూశ్రీ, ద్వితీయ, రాజానగరం మండలం నరేంద్రపురం పాఠశాల విద్యార్థులు ఎం.వికాస్, సీహెచ్ అరుణ్ కుమార్ తృతీయ బహుమతి సాధించారు. జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ నెల 14న విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలో పాల్గొంటారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న డిప్యూటీ డెమో సత్యకుమార్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రతి స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమనే ప్రదర్శన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డిప్యూటీ డెమో ఎన్.సత్యకుమార్ అన్నారు. రాజవోలు ఏఎంజీ హైస్కూల్‌లో చదువుతున్న బాలికలకు సోమవారం పీసీపీఎన్డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆడపిల్లల్లో రక్తహీనత, పిరియడ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవల్లి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

23న ప్రజా సింహగర్జన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామచంద్ర యాదవ్ తదితరులు

సీటీఆర్ఐ: విజయవాడ-గుంటూరు మధ్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంతంలో ఈనెల 23న ఆంధ్రప్రదేశ్ ప్రజా సింహగర్జన సభను భారీ ఎత్తున నిర్వహిస్తామని పారిశ్రామిక వేత్త బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. స్థానిక ఎంఎఫ్ ఫంక్షన్ హాల్లో సోమవారం జరిగిన సమావేశంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ ప్రజలు, రైతులు, యువతను అన్ని విధాలుగా వంచించిన పార్టీల వైఖరిని ఎండ గట్టడంతో పాటు నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావాన్ని కూడా ప్రకటిస్తామన్నారు. పూలే - అంబేద్కర్ సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు అత్తిలి రాజు, వివిధ వర్గాలకు చెందిన నాయకులు కెకె సంజీవరావు, సానబోయిన రామారావు, ఎల్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రదానం



రవిశంకర్‌కు పీహెచ్‌డీ అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగానికి చెందిన జెట్టి రవిశంకర్‌కు వీసీ ఆచార్య కె.పద్మరాజు సోమవారం పీహెచ్‌డీని ప్రదానం చేశారు. ఏపీలో ఎంపిక చేసిన నగరాలలో క్యాపిటల్ మార్కెట్ల పట్ల పెట్టుబడి నిర్ణయం తీసుకోవడంలో పెట్టుబడిదారుల ప్రవర్తన అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ గైడ్‌గా వ్యవహరించారు.

పేకాట శిబిరాలపై దాడి

మధురపూడి: కోరుకొండ మండలం నిడిగట్ల, దోసకాయలపల్లి గ్రామాల్లో జరుగుతున్న పేకాట శిబిరాలపై సోమవారం ట్రైనీ ఐపీఎస్ పంకజ్ మీనన్, ఎస్సై కట్టా శారదా సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాటాడుతున్న 13 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.40,230, ఐదు మోటారు సైకిళ్లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

బిక్కవోలు: పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు సోమవారం తెలిపారు. కొమరిపాలెం గ్రామ శివార్లు పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు అరెస్టు చేశామని తెలిపారు. వారి నుంచి రూ.8,160 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచామన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

మధురపూడి: బడి మానేసిన ప్రతి విద్యార్థినీ తిరిగి పాఠశాలకు పంపేందుకు సమష్టిగా కృషి చేద్దామని హెచ్‌ఎం యు.గంగాభవాని అన్నారు. కోరుకొండ మండలం గుమ్ములూరు హైస్కూల్లో సోమవారం వలంటీర్లు, గుమ్ములూరు. బుచ్చెంపేట సచివాలయాల్లోని ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులకు అందించాలన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు, వారి సహాయకులకు భోజనం అందిస్తున్న దాత

రాజానగరం: ప్రధానమంత్రి సురక్షిత్ మంత్రిత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా సోమవారం పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 27 మంది గర్భిణులకు డాక్టర్ ఎస్.శ్రీరాణి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 14 మందికి డెలివరీ హైరిస్క్‌గా గుర్తించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు గ్రామానికి చెందిన రావిపాటి నాగేశ్వరరావు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎన్‌వీ రమణ, డీడీ భవాని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.